




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 221

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

మంగళవారం 13 జనవరి 2026


## 2026లోనూ ఉత్తమ ఫలితాలే సాధిద్దాం

- స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సుతో బెస్ట్ రిజల్ట్స్
- పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానం ఏపీ
- 16 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా కార్యాచరణ
- విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్‌కు రూ.1.19 తగ్గించటం లక్ష్యం
- ఈ ఏడాదిలోనే ల్యాండ్ రికార్డుల పూర్తి ప్రక్షాళన
- వీబీ జీ రామ్‌జీ ఉపాధి హామీ సమర్థ వినియోగంతో కమ్యూనిటీ ఆస్తుల పెరుగుదల
- గత పాలకులది తిరుమల పవిత్రను దెబ్బతీసే కుట్ర
- తిరుమలలో మద్యం బాటిళ్లు పెట్టి దుర్మార్గానికి పాల్పడ్డారు
- మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లతో సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు




**అమరావతి,కలంకౌంటర్ :** సవాళ్లను అధిగమించి 2025లో సాధించిన ఫలితాలకు మించి ఈ ఏడాది అత్యుత్తమ ఫలితాలు సాధించేలా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విధ్వంసమైన వ్యవస్థలను గాడిన పెట్టి సుపరిపాలన అందిస్తున్నామని అన్నారు. 2025 ఏడాదిలో మంచి ఫలితాలతో ప్రజల ఆశల్ని నిలబెట్టి విశ్వాసాన్ని మళ్లీ నింపామని తెలిపారు. ఈ ఏడాది కూడా మరింత కష్టించి పని చేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్ర సచివాలయంలోని 5వ బ్లాకులో మంత్రులు, సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్లు వర్చువల్‌గా హాజరయ్యారు.

**సంక్షేమ పాలనకు మరొక మైలురాయి..** గత ప్రభుత్వ విధానాలతో కనీసం అప్పు తీసుకునే వెసులుబాటు కూడా లేని పరిస్థితి నుంచి సూపర్ సిక్స్ ద్వారా సంక్షేమం, అభివృద్ధిని వేగంగా చేయగలిగామని సీఎం చంద్రబాబు అన్నారు. 'తల్లికి వందనం ద్వారా రూ.10,090 కోట్లను 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు వేశాం. స్త్రీశక్తి ద్వారా 3.5 కోట్ల ప్రయాణాలు మహిళలు చేశారు. దీని కోసం ఇప్పటి వరకూ రూ.1114 కోట్లు వ్యయం చేశాం. అన్నదాత సుఖీభవ ద్వారా 46 లక్షల మంది రైతులకు రూ.6,310 కోట్లు జమ చేశాం. దీపం 2.0 ద్వారా 2 కోట్ల సిలిండర్లను ఇప్పటికి పంపిణీ చేయగలిగాం. దీనికి రూ.2684 కోట్లు వ్యయం చేశాం. ఏడాదిన్నరలో రూ.50 వేల కోట్ల మేర సామాజిక పెన్షన్లను అందించటంలో సంక్షేమంలో కొత్తమైలు రాయిని సాధించాం. 70 వరకూ పెద్ద పథకాలు, కార్యక్రమాలు, పనులు చేశాం. సంక్షేమ పాలనలో మరో మైలురాయిని దాటాం' అని సీఎం అన్నారు.

**పోలవరం పూర్తైతే ఏ రాష్ట్రమూ పోటీ పడలేదు..**
గత పాలకులు అమరావతిని స్మశానం, ఎడారని ఎగతాళి చేశారని, కానీ ఇదొక స్ఫూర్తిదాయక ప్రాజెక్టు అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాజధాని అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నాం అని అన్నారు. 'పోలవరం అత్యద్భుతమైన ప్రాజెక్టు, ఈ ప్రాజెక్టు పూర్తి అయితే దక్షిణ భారత్‌లో ఏ రాష్ట్రమూ మనతో పోటీ పడలేదు. ప్రతీ ఏటా 3 వేల టీఎంసీల మేర నీరు వృధాగా సముద్రంలోకి వెళ్తోంది. పట్టి సీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు ఇవ్వటం ద్వారా శ్రీశైలంలోని నీటిని పొదుపు చేసి రాయలసీమకు ఇస్తున్నాం. నల్లమల సాగర్ ద్వారా రాయలసీమ, ప్రకాశం తదితర ప్రాంతాలకు నీరు ఇచ్చే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఎవరికీ నష్టం లేదు. ఎగువ నుంచి వదిలిన నీళ్లు పోలవరం నుంచి నల్లమల సాగర్ కు తీసుకెళ్లి వాడుకుంటే తప్పేంటి. పోలవరంలో మిగిలిన నీళ్లు తెలంగాణా రాష్ట్రం కూడా వినియోగించుకునే అవకాశం ఉంటుంది. తెలంగాణ ప్రాజెక్టులు కట్టినప్పుడు నేనెప్పుడు అడ్డు చెప్పలేదు. రెండు తెలుగు రాష్ట్రాలూ గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవచ్చు. పుష్కరాల్లోగా పోలవరం ప్రాజెక్టును నిర్మించి జాతికి అంకితం చేస్తాం' అని అన్నారు.

**త్వరలో భోగాపురం విమానాశ్రయం జాతికి అంకితం..**
విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిస్తున్న ఎయిర్ పోర్టును త్వరలోనే జాతికి అంకితం చేస్తామని సీఎం స్పష్టం చేశారు. కేంద్ర సాయంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.12 వేల కోట్ల రాబట్టి కాపాడుకున్నామని అన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల సెంటిమెంట్ ఆ ప్లాంట్ ను నిలబెట్టి తీరుతామని ఉద్ఘాటించారు. 'దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబడులు ఏపీకే వచ్చాయి. పెట్టుబడులకు డెస్టినేషన్ గా ఆంధ్రప్రదేశ్ మారింది. సీఐఐ ద్వారా చేసుకున్న ఒప్పందాలు అన్నీ సాకారం అయితే 16 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఎస్ఐపీబీ ద్వారా 8.74 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం కూడా ఇచ్చాం. వీటి ద్వారా కూడా పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయి. గూగుల్ కూడా 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో ఏఐ డేటా సెంటర్ ను విశాఖలో ఏర్పాటు చేస్తోంది. రాష్ట్రానికి పెట్టుబడులు రావటంలో కృషి చేసిన అధికారులు, ప్రభుత్వ విభాగాలను అభినందిస్తున్నాను. అమరావతిలో క్వాంటం వ్యాలీకి త్వరలో ఫౌండేషన్ వేస్తాం. ఆరు నెలల్లో క్వాంటం కంప్యూటర్ ఇక్కడి నుంచి పనిచేస్తుంది. విద్యుత్ కొనుగోలు ధరను గణనీయంగా తగ్గించగలిగాం. భవిష్యత్తులో రూ.1.19 పైసల మేర యూనిట్ కొనుగోలు ధర తగ్గించటం లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని రిజర్వాయర్‌లలోనూ 970 టీఎంసీలను నింపగలిగాం. రాయలసీమలోనూ పెద్ద ఎత్తున నీటిని నిలిపాం' అని అన్నారు.

**కమ్యూనిటీ ఆస్తులు పెరుగుతాయి..** 12 శాతానికి పైగా గత ఏడాది వృద్ధి సాధించామని, ఈసారి రెండో త్రైమాసికంలోనే 11.28 గ్రోత్ రేట్ సాధించామని సీఎం చంద్రబాబు అన్నారు. మన లక్ష్యం 16 శాతం వృద్ధి రేటు. దానికి అనుగుణంగా పనిచేయాలని కోరుతున్నాను. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం తీసుకువచ్చాం. అలాగే పౌర సేవల్లో కూడా స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు సాధించగలిగితే 2026లో మరింత మంచి ఫలితాలు సాధించవచ్చు. పట్టా దారు పాస్ పుస్తకాలను రాజ ముద్రతో జారీ చేస్తున్నాం. గతంలో ఫోటోలు వేసుకుని ఇష్టానుసారంగా వ్యవహరించారు. రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేస్తున్నాం. అలాగే రీసర్వే

- 2లో

## నారావారిపల్లె కు సీఎం చంద్రబాబు

- కుటుంబ సమేతంగా రేపు సంక్రాంతి సంబరాల్లో పాల్గొననున్న సీఎం
- నేటి నుంచి నాలుగు రోజుల పాటు స్వగ్రామంలో సీఎం
- రేపు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్న సీఎం

**అమరావతి,కలంకౌంటర్ :** సంక్రాంతి వేడుకల్లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన స్వగ్రామం నారావారిపల్లెకు వెళ్లారు. ఏటా కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలిసి సంక్రాంతి పండుగ జరుపుకునే సీఎం చంద్రబాబు...ఈ ఏడాది కూడా స్వగ్రామానికి చేరుకున్నారు. సోమవారం మంత్రులు, సెక్రటరీలు, కలెక్టర్లతో సచివాలయంలో సమీక్షా సమావేశం అనంతరం సాయంత్రం నారావారిపల్లెకు చేరుకున్నారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, కార్యకర్తలు, నేతలతో కలిసి రేపు సంక్రాంతి సంబరాల్లో పాల్గొంటారు. మంగళవారం నారావారిపల్లెతో పాటు తిరుపతిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేస్తారు.

**ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు...శంకుస్థాపనలు..** మంగళవారం ఉదయం 8 గంటలకు గ్రామంలోని టీటీడీ కళ్యాణ మండపం ప్రాంగణంలో నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో సీఎం పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం శేషాచల లింగేశ్వర స్వామి దేవస్థానం వద్దకు సీఎం చంద్రబాబు వెళ్లనున్నారు. రూ.70 లక్షలతో ఎ-రంగంపేట-- భీమవరం రోడ్డు నుంచి శేషాచల లింగేశ్వర స్వామి ఆలయం వరకు నిర్మించిన రహదారిని ప్రారంభిస్తారు. నారావారిపల్లెలో 33/11 కేవీ సెమీ ఇండోర్ సబ్ స్టేషన్, రూ.1.4 కోట్లతో పరిశ్రమల అవసరాలకు తగినట్టుగా యువతకు శిక్షణ ఇచ్చేలా నిర్మించిన స్కిల్ బిల్డింగ్ సెంటర్, సంజీవని ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. ఇక తిరుపతిలో రూ.45 లక్షలతో నిర్మించిన శ్రీ వేంకటేశ్వర రామ్‌నారాయణ్ రుయా ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్ అటెండెంట్ అమీనిటీస్ కాంప్లెక్స్, ఎస్వీ యూనివర్సిటీలో రూ.7.5 కోట్లతో నిర్మించిన బాయ్స్ హాస్టల్, రూ.5 కోట్లతో నిర్మించిన గర్ల్స్ హాస్టల్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. మూలపల్లిలో నీటి సరఫరాకు సంబంధించి నీవా బ్రాంచ్ కెనాల్ నుంచి కల్యాణి డ్యామ్‌కు, మూలపల్లి చెరువుతో పాటు మరో 4 చెరువులకు నీటిని తరలించేలా రూ.126 కోట్లతో చేపట్టే ప్రాజెక్టుకు, రూ.10 లక్షలతో పశువుల వసతి సముదాయానికి శంకుస్థాపన చేస్తారు. ఎస్వీ యూనివర్సిటీలో పరిశోధన, ఆవిష్కరణలకు ఊతం ఇచ్చేలా రూ.6 కోట్లతో సెంట్రలైజ్డ్ అడ్వాన్స్డ్ పరిశోధన ల్యాబ్స్, విద్యా మౌలిక వసతుల్లో భాగంగా రూ.5.03 కోట్లతో అకడమిక్ బిల్డింగ్ 2వ అంతస్తుకు, రూ.2.91 కోట్లతో చేపట్టే కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు.

**నాగాలమ్మకు ప్రత్యేక పూజలు..** 15వ తేదీన తమ గ్రామ దేవతైన నాగాలమ్మ గుడికి కుటుంబ సమేతంగా సీఎం చంద్రబాబు వెళ్తారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదే రోజున నారావారిపల్లె నుంచి అమరావతికి చేరుకుంటారు.

## సాయినాధుని సేవలో లోకేష్ దంపతులు







**షిరిడీ,కలంకౌంటర్ :** షిరిడీ శ్రీ సాయినాధుని సన్నిధిలో కాకడ హారతి, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ సభ్యులు, అధికారులు లోకేష్ దంపతులకు స్వాగతం పలికి దుశ్శాలువతో సత్కరించారు. కాకడ హారతి అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.






# రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన ప్రభుత్వ చీఫ్ విప్





వినుకొండ,కలంకౌంటర్ : క్రీడలు శారీరక దృఢత్వానికే కాకుండా మానసిక ఉల్లాసానికి, యువతలో క్రమశిక్షణ పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. ఆదివారం వినుకొండ పట్టణంలోని మసీదు మాన్యం గ్రౌండ్ నందు తెలుగు యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "రాష్ట్రస్థాయి నియోజకవర్గ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంటును ఆయన అధికారికంగా ప్రారంభించారు.జీవీ బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. యువత గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని చాటాలని జీవీ గారు పిలుపునిచ్చారు. నియోజకవర్గ స్థాయిలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు. తెలుగు యువత నాయకులు,నాయకులు, యువత పాల్గొన్నారు.

# దేవాలయం నిర్మాణ పనులను పరిశీలించిన ప్రభుత్వ చీఫ్ విప్





వినుకొండ,కలంకౌంటర్ : వినుకొండ కొండపై శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం నిర్మాణ పనులను ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు సోమవారం పరిశీలించారు. దేవాదాయ స్తపతి, ఈవో, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జూలై 25 తొలి ఏకాదశి పండుగ నాటికి 90% ఆలయ నిర్మాణం పనులు పూర్తి చేసే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. 11 కోట్లతో ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు కూడా త్వరలో చేపట్టడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, అభివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# స్వామి వివేకానంద ఆశయాలే ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు, లోకేష్ అమలు చేస్తున్నారు

– అర్వపల్లి అంజనేయులు



కందుకూరు, కలంకౌంటర్ : భారత యువతకు ఆత్మవిశ్వాసం సేవాభావం దేశభక్తిని నూరిపోసిన మహనీయుడు వివేకానందుడని అయన జయంతి సందర్భంగా అంజనేయులు అన్నారు స్వామి వివేకానంద ఆలోచనలే టిడిపి రాజకీయాలకు మౌలిక ప్రేరణని ఆ ఆశయాలను రాజకీయ కార్యాచరణగా మలిచిన నాయకుడు ఎన్టీఆర్ అని అదే బాటలో విజన్‌తో పాలన అందిస్తున్న నాయకుడు చంద్రబాబు రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి ఆర్వపల్లె ఆంజనేయులు వ్యాఖ్యానించారు. ఎన్టిఆర్ రాజ కీయాలను ప్రజల దగ్గరకు తీసుకొచ్చారని పేదల గౌరవం, ఆత్మ విశ్వాసమే టిడిపి పార్టీని స్థాపించారని అన్నారు ఆశయాల కు ఆధునిక రూపం ఇచ్చి విజన్ పాలిటిక్స్ కు కొత్త అర్థం చెప్పింది చంద్రఅబశ్రీశ్రీబాబు అని అన్నారు. అభివృద్ధి, సాంకేతికత పార దర్శక పాలన ఇవన్నీ వివేకానంద ఆశయాలకు ఆధునిక అనువాదమేనని పేర్కొన్నారు.యువతను రేపటి నాయ కులుగా తీర్చిదిద్దాలన్న వివేకానంద పిలుపు ను ఆచరణలో పెడుతున్న యువ నాయకుడు మన నారా లోకేష్ అని తెలి పారు.విద్య,ఉపాధితొ యువత సాధికార త పై లోకేష్ చూపుతున్న దృష్టి టిడిపి భవిష్యత్ రాజకీయాలకు బలమైన పునా దిగా మారుతోందన్నారు అంజనేయులు.

# 2026లోనూ ఉత్తమ ఫలితాలే సాధిద్దాం

● మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లతో సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు




(మొదటిపేజీ తరువాయి)

ప్రక్రియను కూడా వేగంగా చేపడుతున్నాం. గతంలో ఎన్టీఆర్ మునసబు, కరణాల వ్యవస్థను రద్దు చేసి రెవెన్యూ విభాగాన్ని ప్రక్షాళన చేశారు. ఈ 2026 ఏడాదిలో ల్యాండ్ రికార్డులను పూర్తిగా ప్రక్షాళన చేస్తాం. రిజిస్ట్రేషన్ విభాగంలోనూ పూర్తి పారదర్శకంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. టెక్నాలజీ వినియోగించుకుని పూర్తి పారదర్శకంగా ఈ వ్యవస్థను మారుస్తాం. ప్రభుత్వ కార్యాలయాల్లో వేగంగా దస్త్రాలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. వీబీ జీ రామ్ జీ ఉపాధి హామీ చట్టాన్ని సమర్థంగా వినియోగించుకోవాలి. తద్వారా కమ్యూనిటీ ఆస్తులు మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది' అని సీఎం అభిప్రాయపడ్డారు.

**దేవుడితో రాజకీయాలు బాధాకరం..**దేశంలో 25 ఏళ్ల క్రితమే పీపీపీ విధానంలో జాతీయ రహదారుల నిర్మాణం ప్రారంభమైంది. ఇవాళ గిన్నీస్ రికార్డును సాధించే దిశగా రహదారుల నిర్మాణం జరుగుతోందని చంద్రబాబు అన్నారు. చేసిన పనులు సమర్థంగా ప్రజలకు చెప్పుకోవటం ముఖ్యమన్నారు. 'కలియుగ వైకుంఠం తిరుమల తిరుపతి దేవస్థానం. శ్రీ వేంకటేశ్వరస్వామిపై ప్రజలకు అంత నమ్మకం. అలాంటి క్షేత్రాన్ని అపవిత్రం చేసే ప్రయత్నాలు జరిగాయి. పరకామణిలో దొంగతనం జరిగితే సమర్ధించే ప్రయత్నం చేశారు. కల్తీ నెయ్యితో ప్రసాదం తయారీ, ఖాళీ మద్యం బాటిళ్లను తిరుమలలో పెట్టడం లాంటి దుర్మార్గపు పనులకు పాల్పడ్డారు. దేవుడితో కూడా రాజకీయం చేస్తున్నారు. ఇది చాలా బాధాకరం.దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నా' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

# వివాదాలు వద్దు-ఐక్యతే ముద్దు..

● పరస్పర సహకారంతోనే ప్రగతి సాధ్యం. ● పోలవరం-నల్లమల సాగర్ వల్ల ఎవరికీ నష్టం ఉండదు.

● జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.

అమరావతి,కలంకౌంటర్ : గోదావరి నదికి సంబంధించి ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన పోలవరం – నల్లమల సాగర్ ప్రాజెక్ట్ వల్ల ఎవరికీ నష్టం లేదని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మరోసారి స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు సిజేఐ సూచనల మేరకు ఈ ప్రతిపాదిత ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ వేసిన పిటిషన్ ను వెనక్కి తీసుకున్న నేపథ్యంలో సోమవారం రామానాయుడు ఈ విషయంపై స్పందించారు. పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు పై తెలంగాణా అభ్యంతరాలను సుప్రీం కోర్టు డిస్పోజ్ చేయడంపై మంత్రి నిమ్మల మాట్లాడుతూ, ఉభయ తెలుగు రాష్ట్రాలు బాగుండాలని మొదటి నుంచీ, కోరుకుంటున్నామని చెప్పారు. ఏటా వృధాగా సముద్రంలో కలుస్తున్న 3వేల టిఎంసిల నీటిలో 200 టిఎంసిలు మాత్రమే వాడుకుంటామని స్పష్టంగా చెబుతున్నాం. అపోహలు విడనాడి ఇప్పటికైనా సహకరించమని రామానాయుడు కోరారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణాకు ఎటువంటి నష్టం లేదని ముందునుండి మేం చెబుతూనే ఉన్నామన్నారు. తెలుగు రాష్ట్రాలు సోదరభావంతో కలసి అభివృద్ధి చెందాలనే సిఎం చంద్రబాబు ఆకాంక్షను ఈ సందర్భంగా రామానాయుడు మరోసారి గుర్తు చేశారు. గత 50 ఏళ్ళలో గోదావరి వరదనీరు 1,53,000 టిఎంసిల నీరు వృధాగా సముద్రంలో కలిసి పోయిన సంగతి గుర్తు చేసుకుంటూ ఆవేదన చెందారు. ఈ సంవత్సరం కూడా 4600 టిఎంసిల నీరు వృధాగా సముద్రంలోకి పోయిందని తెలిపారు. రాష్ట్ర విభజన జరిగిన తరువాత గోదావరి ఎగువన కాళేశ్వరం కు ఏమాదిరిగా అనుమతి ఇచ్చారో, ఆవిధంగా దిగువన పోలవరం-నల్లమలసాగర్ కు అనుమతి ఇవ్వమంటున్నాం. మా కోరిక సమంజసమైనది, సహేతుకమైనది. సహజ న్యాయ సూత్రాలకు లోబడినదని ఆయన అన్నారు. పోలవరం దగ్గర వరద నీరును ఉపయోగించుకుంటే, ఆంధ్రప్రదేశ్ ఉపయోగించుకోవాలి, లేదంటే సముద్రంలో ఉప్పునీటిలో కలిసిపోతుంది. అలాంటప్పుడు తెలంగాణకు నష్టం జరిగే ప్రశ్నే లేదన్నారు. గోదావరిలో పుష్కలంగా నీరు ఉందనే ఆనాడు రాష్ట్ర విభజన తర్వాత కాళేశ్వరాన్ని తెలంగాణ నిర్మాణం చేస్తున్నా, మేము అడ్డుకోకుండా సహకరించామన్నారు. పోలవరం-నల్లమలసాగర్ పూర్తైతే మనరాష్ట్ర ప్రయోజనాలు తీరిన తరువాత తెలంగాణకు సైతం ఉపయోగం ఉంటుందన్నారు.

# ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికకు 26 వినతులు..





తిరుపతి,కలంకౌంటర్ : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 26 వినతులు వచ్చాయని అదనపు కమిషనర్ శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 20 మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, ఆరు మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా తమ వార్డులో సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ అనిల్ కోరారు. చింతకాయల వీధిలోని మా ఇంటిపైకి చెట్టు వాలిపోయి ఇబ్బందిగా ఉంది పరిష్కరించాలని, కైకల చెరువు, కోర్లగుంట ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజి కాలువల లీకేజీ అరికట్టాలని, కూరపాటీ రామచంద్ర నగర్ లో తెలుగుగంగ నీరు సరఫరా చేయాలని, డి. ఆర్. మహల్ రోడ్డులో అక్రమ నిర్మాణాలు అరికట్టాలని, కొరమేనుగుంట లో సి.సి. రోడ్లు ఏర్పాటు చేసి, తెలుగుగంగ నీరు సరఫరా చేయాలని, శ్రవణం వద్ద కాలువ నిర్మించాలని, స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని, శాంతినగర్ పార్కు ఓపెన్ చేసి, వాకింగ్ ట్రాక్ వద్ద దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

# మాజీ సీఎం రోశయ్య సతీమణి మరణం ఎంతో బాధాకరం-- దేవకి

అమరావతి, కలంకౌంటర్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ డాక్టర్ కొణిజేటి రోశయ్య సతీమణి శివలక్ష్మి మృతి పట్ల వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు, శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ దేవకి వెంకటేశ్వర్లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా దేవకి మాట్లాడుతూ రాష్ట్రానికి సుపరిచితులైన మన మాజీ ముఖ్యమంత్రి రోశయ్య సతీమణి శివలక్ష్మి మరణం తీరని లోటు అన్నారు.వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యల వల్ల ఆమె మరణించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా శివలక్ష్మి మృతి పట్ల సంతాపం వ్యక్తపరుస్తూ రోశయ్య కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియపరుస్తున్నట్లు తెలిపారు.

# 'లేపాక్షి'లో డిస్కౌంట్ అమ్మకాలు

● రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత




అమరావతి,కలంకౌంటర్ :వివిధ ప్రాంతాలకు చెందిన కళారూపాలకు మార్కెట్ కల్పించడంతో పాటు కళాకారులకు ఆర్థిక భరోసా లభించేలా లేపాక్షి షో రూమ్ ల్లో 30 శాతం వరకూ డిస్కౌంట్ అమ్మకాలు ప్రారంభించినట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఆయా కళారూపాలను 10, 20, 30 శాతం డిస్కౌంట్లతో అమ్మకాలు చేస్తున్నామన్నారు. సంక్రాంతి పండగ దృష్ట్యా డిస్కౌంట్ అమ్మకాలు ప్రారంభించామన్నారు. దీనివల్ల కళారూపాలను తక్కువ ధరలకే లభించడంతో పాటు అదే సమయంలో అమ్మకాలు పెరగడం వల్ల కళాకారులకు ఉపాధి పెరిగే అవకాశముందని తెలిపారు. రాష్ట్రంలో మూడు లేపాక్షి షో రూమ్ లను వినియోగదారులకు ఆకట్టుకునేలా అభివృద్ధి చేయనున్నామని, ఇందుకోసం ఒక్కో షో రూమ్ నకు రూ.15 లక్షల వరకు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఈ కామర్స్ లోనూ కళారూపాలను అందుబాటులో ఉంచాలని, ఇందుకోసం ప్రత్యేక వెబ్ సైట్ ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అమరావతి లోని రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ లో లేపాక్షి అధికారులతో మంత్రి సవిత సమీక్షా సమావేశం నిర్వహించారు. సంక్రాంతి పండగను దృష్టిలో పెట్టుకుని కళారూపాల అమ్మకాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా కళారూపాలకు ఉన్న డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని 10, 20 30 శాతంతో డిస్కౌంట్ అమ్మకాలు ఏ మేరకు జరుగుతున్నాయో మంత్రి సవిత అడిగి తెలుసుకున్నారు. లేపాక్షి షో రూమ్ ల్లో ఈ నెలాఖరు వరకూ జరిగే డిస్కౌంట్ అమ్మకాలపై మీడియా, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేయాలన్నారు.

**విడతల వారీగా షో రూమ్ ల అభివృద్ధి..** రాష్ట్రంతో పాటు దేశంలో ఇతర ప్రాంతాల్లో 19 లేపాక్షి షో రూమ్ లు ఉన్నట్లు ఆ సంస్థ ఎండీ విశ్వ తెలిపారు. వాటిలో 16 షో రూమ్ లు ఏపీలోనే ఉన్నాయన్నారు. దీనిపై మంత్రి సవిత స్పందిస్తూ, ప్రస్తుత తరం ఆలోచనలు, అభిరుచులకు అనుగుణంగా లేపాక్షి షో రూమ్ లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వినియోగదారులను ఆకట్టుకునేలా ఆ నిర్మాణాలు ఉండాలన్నారు. మొదటి విడతలో విశాఖపట్నం, అనంతపురం, కడప లేపాక్షి షో రూమ్ లను అభివృద్ధి చేయనున్నామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఒక్కో షో రూమ్ కు రూ.15 లక్షల చొప్పున వెచ్చిస్తోందన్నారు. ఇప్పటికే చేపట్టిన ఢిల్లీలో ఉన్న లేపాక్షి షో రూమ్ అభివృద్ధి పనులు గురించి మంత్రి వాకబు చేశారు. మిగిలిన 15 షో రూమ్ లను విడతల వారీగా అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు.

# వాసవి నగర్ నందు హేష్విత దంత వైద్యశాల వారి ఉచిత మెడికల్ క్యాంపు





కందుకూరు, కలంకౌంటర్ : కందుకూరు పట్టణంలో వాసవి నగర్ నందు హేష్విత మల్టీస్పెషల్టి దంత వైద్యశాల వారి ఆధ్వర్యంలో డాక్టర్ గౌతమ్ నెప్పల, డాక్టర్ పాలడుగు దేవీ నవ్య ఉచిత క్యాంపును నిర్వహించారు. వాసవి నగర్ లో ఉన్న వారు ఉచిత క్యాంపు నందు పాల్గొని వారి పంటి సమస్యలను చూయించుకున్నారు. ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి కొన్ని పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌతమ్ నేపల, డాక్టర్ దేవీ నవ్య మాట్లాడుతూ కందుకూరు పరిసర ప్రాంతంలో పలుచోట్ల ఉచితంగా డెంటల్ మెడికల్ క్యాంపులు నిర్వహించామని తెలిపారు. మెడికల్ క్యాంపు నందు చూపించుకున్న ప్రతి ఒక్కరికి తమ హాస్పటల్ నందు 20% రాయితీ కల్పిస్తామని తెలిపారు. తమ హాస్పటల్ నందు అధునాతన పరికరాలతో రోగులకు ట్రీట్మెంట్ అందిస్తున్నామని తెలిపారు. అనంతరం వారి దంపతులను వాసవి నగర్ వాసులు ఘనంగా సన్మానించారు.

# పేద, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

● మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

● వెలగపూడి సచివాలయంలో సామాజిక సంక్షేమ బోర్డు క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



అమరావతి/వెలగపూడి సచివాలయం,కలంకౌంటర్ : పేద, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయంస్వామిం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో పేద, బలహీన వర్గాల అభ్యున్నతి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. రాష్ట్రంలోని బలహీన వర్గాలకు పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో తొలిసారిగా ముస్తాబు కార్యక్రమం ద్వారా హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా అన్ని హాస్టల్స్ లో వసతుల మెరుగుకు కృషి చేస్తున్నట్లు మంత్రి చెప్పారు.అబశ్రీశ్రీ ఈ కార్యక్రమంలో సామాజిక బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సచివాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సీఎం చంద్రబాబు నాయుడు నివాళులు అర్పించారు. సీఎంతో పాటు సీఎస్ విజయానంద్ , మంత్రులు, అధికారులు వివేకానందకు నివాళులర్పించారు.

–అమరావతి,కలంకౌంటర్ :

# విద్యుత్ అంతరాయాలకు చెక్ పెట్టిన కూటమి ప్రభుత్వం..

గ్రామాలలో విద్యుత్ అంతరాయాలకు కూటమి ప్రభుత్వం చెక్ పెట్టిందని సర్పంచ్ కోసూరు అనూష అన్నారు.




**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి మండల పరిధిలోని కోసూరువారిపాలెం గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకమైన "పునరుద్ధరించబడిన పంపిణీ రంగ పథకం " (RDSS) కార్యక్రమాన్ని సర్పంచ్ అనూష సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కూటమి నాయకులు అలాగే గ్రామస్తులతో కలిసి అనూష 24 గంటల విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. అనంతరం అవనిగడ్డ శాసనసభ్యులు, రాష్ట్ర శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్ మండలి బుద్ధప్రసాద్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. తమ గ్రామ అభివృద్ధికి బుద్ధప్రసాద్ కృషి చేస్తున్నారని సర్పంచ్ అనూష కొనియాడారు. నాగాయతిప్ప టౌన్ ఫీడర్ పరిధిలోని కోసూరువారిపాలెం గ్రామపంచాయతీకి త్రీ ఫేస్ విద్యుత్ అమర్చడం వలన 24 గంటల పాటు గ్రామంలో విద్యుత్ సరఫరా అవుతుందని =ఋూా నాగాయతిప్ప టౌన్ ఫీడర్ ఇంజనీరింగ్ సహాయకులు సురేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్ బాబు, ఉప సర్పంచ్ కోసూరు రాధాకృష్ణమూర్తి, గ్రామ ప్రముఖులు కోసూరు శివనాగమల్లేశ్వరరావు, పిఎసిఎస్ చైర్మన్ కోసూరు నాగమల్లేశ్వరరావు, బిజెపి మండల అధ్యక్షులు సనకా ప్రశాంత్, కోసూరు మునీంద్ర, యక్కటి రామాంజనేయులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు యక్కటి హనుమాన్ ప్రసాద్, గరికిపాటి కృష్ణ ప్రసాద్, కోసూరు రామారావు, కోసూరు పవన్, కోసూరు అమలేశ్వరరావు, సనకా జనార్ధనరావు, కోసూరు వేణుగోపాలరావు, బడే వినయ్, బడే రామకృష్ణ, విద్యుత్ శాఖ సహాయకులు డొక్కు శివరామకృష్ణ, భోగిరెడ్డి రాజా, కోసూరు పున్నయ్య, కోసూరు రేణుకయ్య, కోసూరు రామాంజనేయులు, మేస్త్రి మునిపల్లి శ్రీనివాసరావు లతో పాటు పెద్ద సంఖ్యలో కూటమి పార్టీల శ్రేణులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వివేకానందుని జీవితం యువతకు స్ఫూర్తిదాయకం - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం పట్టణంలోని 2వ పట్టణ పోలీస్ స్టేషన్లో స్వామి వివేకానందుని జన్మదిన వేడుకులకు సోమవారం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ముఖ్య అతిధిగా హాజరై వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – భారతదేశ కీర్తిని, సంప్రదాయాలను, విలువలను ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన ఘనత స్వామి వివేకానందునిదేనన్నారు. తన స్వల్ప జీవిత కాలంలో మానవాళి సంక్షేమానికి, అభ్యున్నతికి, అధ్యాత్మిక ఉన్నతికి వివేకానం దుడు ఎంతగానో కృషి చేసారన్నారు. ఏ వ్యక్తినైనా అతను చేసే పనిని బట్టి కాకుండా, ఆ వ్యక్తి ఆ పనిని ఎంతబాగా చేసాడు అనేదానిపై ఆ వ్యక్తి యొక్క గొప్పతనం ఆధారపడి ఉంటుందని వివేకానందుడు చెప్పారన్నారు. వివేకానందుని జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. నేటి యువతే రేపటి మన భవితని, ప్రతీ ఒక్కరూ లక్ష్యాన్ని ఏర్పరుచుకొని, లక్ష్య సాధన కొరకు నిరంతరం శ్రమించాలన్నారు. ప్రతి ఒక్కరూ వివేకానందుని ఆశయాలను గుర్తుంచుకొని, సమాజానికి, మానవాళికి సేవ చేయాలని జిల్లా ఎస్పీ అన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువతకు జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి. సౌమ్యలత, విజయనగరం ఇన్చార్జ్ డిఎస్పీ ఆర్.గోవిందరావు, 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాసరావు, ఎస్ఐలు కృష్ణమూర్తి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని నివాళులు అర్పించారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి కి కూడార్రై ప్రసాద నివేదన !




**పెడన,కలంకౌంటర్ :** పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షులు డా. కొల్లూరి సత్యనారాయణ (చిన్న) పర్యవేక్షణలో కేసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన, శ్రీ వాసవి మహిళా మండలి వారి సహకారంతో స్థానిక శ్రీ వాసవి క్షేత్రములోని శ్రీ పద్మావతి అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఉపాలయం నందు ధనుర్మాస మహోత్సవములు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా డా. కొల్లూరి మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి 108 స్టీల్ బౌల్స్ తో కూడార్రై మహా ప్రసాద నివేదన సమర్పించామన్నారు డా. కొల్లూరి. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వేషధారణలో సబ్బిశెట్టి లహరి పద్మావతి దేవి వేషధారణలో చిట్టూరి ధరణి గోదాదేవి వేషధారణలో కొల్లిపర ఉత్కళ ప్రత్యేక ఆకర్షణగాలి నిలిచి భక్తుల ప్రశంసలను అందుకున్నారు. ధనుర్మాసం నెల రోజులు శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకములను శ్రీ వాసవి క్షేత్రం ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ సాయిబాబు అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారని డా. కొల్లూరి అన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని డా. కొల్లూరి అన్నారు. ఈ సందర్భంగా కేసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన, శ్రీ వాసవి మహిళా మండలి కార్యవర్గ సభ్యులు తిరుప్పావై గోవింద నామాలు విష్ణు సహస్రనామం పారాయణలను అత్యంత భక్తిశ్రద్ధలతో చదివారు. ఈ సందర్భంగా నృత్యకారిణి సబ్బిశెట్టి లహరి టీం వేసిన పద్మంలో గోవింద నామాల ముగ్గు భగవద్గీత గోల్డ్ మెడలిస్ట్ చిట్టూరి ధరణి వేసిన శ్రీ వెంకటేశ్వర స్వామి పద్మావతి అమ్మవారి ముగ్గు పలువురు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆర్యవైశ్య బాలబాలికలు చిలకల విజయలక్ష్మి జూపూడి ఎకిషా ఆచంట చిన్ని ఉరిమి నిక్షిప్త మామిడి లాస్య తదితరులు సంధ్య గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి నిర్వహించిన భక్తి పాటలకు కోలాట ప్రదర్శన పలువురు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వేకువ జాము నుండి అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న భక్తులు జై వాసవి జై జై వాసవి గోవింద నామస్మరణతో శ్రీ వాసవి క్షేత్రం ఆలయం మారుమ్రోగింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి కొల్లూరి రాజా శ్రీ వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు మామిడి సావిత్రి ప్రధాన కార్యదర్శి కొల్లూరి పద్మ కోశాధికారి కొమ్మూరి సుమన కేసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన అధ్యక్షురాలు కొమ్మూరి విజయదుర్గ ప్రధాన కార్యదర్శి జవాజ మాధవి కార్యవర్గ సభ్యులు జల్లూరి శిరీష కొల్లిపర స్వర్ణ లేఖ జూపూడి సృజన జల్లూరి గంగ భవాని కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం 11 సూత్రాలు అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ జల్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కులాలు, మతాలకు అతీతంగా "సంక్రాంతి" వేడుకలు

-జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్





**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం పట్టణం 2వ పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను పోలీసు స్టేషను ప్రాంగణం లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ముఖ్య అతిథిగా హాజరై, వేడుకలను ప్రారంభించి, పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో కొంత సమయాన్ని గడిపి, వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – సంక్రాంతి పండగను సహృద్భవ వాతావరణంలో నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. వాస్తవానికి సంక్రాంతి పండగ అన్నది ఒక మతానికి, కులానికి చెందిన పండగ కాదన్నారు. వ్యవయసాయదారులు కష్టించి పండించిన పంట చేతికి రావడం, సిరి సంపదలు, ఆదాయం చేతికి అందడంతో, కుటుంబ సభ్యులతో తమ ఆనందాన్ని పంచుకుంటూ, జరుపుకొనే వేడుకని అన్నారు. కావున, ఈ పండగను మతాలు, కులాలకు అతీతంగా నిర్వహించుకోవాలన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే సంక్రాంతి వేడుకను 2వ పట్టణ పోలీసు స్టేషను ప్రాంగణంలో నిర్వహించుకోవడం, వేడుకల్లో పోలీసు అధికారులు, సిబ్బంది అన్న తారతమ్యం లేకుండా నిర్వహించుకోవడం, పోలీసు కుటుంబాలు కూడా భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు పోలీసులు ఎప్పుడూ చేరువగా ఉండాలని, పోలీసు స్టేషనుకు వచ్చే బాధితులకు చట్ట పరిధిలో సహాయపడాలన్నారు. పోలీసు స్టేషనుకు వచ్చే బడుగు, బలహీన వర్గాలు, పేదలు, వృద్ధులు, మహిళలు, పిల్లలకు అందుబాటులో ఉంటూ, పోలీసు సేవలను అందించాలన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపట్ల, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. పండగ పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించ వద్దని, వారిపై ఉక్కుపాదం మోపాలని పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా ఎల్లప్పుడు ఖాకీ యూనిఫారం ధరించే పోలీసు అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలసి తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులు ధరించి, వేడుకల్లో పాల్గొని, ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గొబ్బెమ్మలు, రంగురంగుల ముగ్గులు, భోగి మంటలు ఆకట్టుకున్నాయి. అనంతరం, జిల్లా ఎస్పీ పోలీసు స్టేషను సందర్శించి, 2వ పట్టణ పోలీసు స్టేషనులో గతంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూం, 2వ పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరును జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సంక్రాంతి సంబరాల్లో అదనపు ఎస్పీ పి. సౌమ్యలత, విజయనగరం ఇన్చార్జ్ డిఎస్పీ ఆర్.గోవిందరావు, 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాసరావు, ఎస్ఐలు కృష్ణమూర్తి,పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సమాచార శాఖ కార్యాలయంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు








**విజయవాడ,కలంకౌంటర్ :** సంక్రాంతి పండుగ కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయత, అనురాగాలను పెంచి నూతనోత్సాహంతో ముందుకు సాగుతూ, వ్యక్తిగతంగా, వృత్తిపరంగా మరిన్ని విజయాలను సాధించాలని సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు ఎల్. స్వర్ణలత ఆకాంక్షించారు.. సమాచార పౌర సంబంధాల శాఖ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎన్టీఆర్ పరిపాలనా భవనం రెండో అంతస్థు డైరెక్టరేట్ కార్యాలయంలో ఉద్యోగులు సాంప్రదాయ దుస్తులతో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంప్రదాయబద్ధంగా రంగోలీ ముగ్గులు, రంగవల్లులు, చెరకు గడలు, బొమ్మల కొలువు, భోగిపళ్లు, గాలిపటాలు, సాంప్రదాయ బంతిపూలతో కార్యాలయాన్ని పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించేలా అలంకరించారు. ఈ సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు స్వర్ణలత మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ ఉత్సాహం ప్రతి ఉద్యోగి కుటుంబంలోనూ ఆనందంతో వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. తన చిన్ననాటి సంక్రాంతి జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఇంటి ముందు ముగ్గులు, గొబ్బెమ్మలు పెట్టడం, తెల్లవారుజామున భోగి మంటలు వేసుకుని చలి కాచుకుంటూ సంబరాలు చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉండేదని అదనపు సంచాలకులు ఎల్. స్వర్ణలత తెలియజేశారు. జాయింట్ డైరెక్టర్ కె. కిరణ్ కుమార్ మాట్లాడుతూ... సంక్రాంతి అంటే సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశికి ప్రవేశించే శుభ సందర్భమని, దీనివల్ల ఋతువుల్లో మార్పులు, కొత్త పంటలు, కుటుంబ సభ్యుల కలయిక జరుగుతాయని వివరించారు. సంక్రాంతి పండుగకు మన తెలుగు సంప్రదాయంలో ప్రత్యేక స్థానం ఉందని, ఎక్కడ ఉన్నా ప్రతి ఒక్కరూ తమ జన్మభూమిని చేరుకుని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపే పండుగ సంక్రాంతేనని పేర్కొన్నారు. వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ కొత్త సంప్రదాయం భవిష్యత్తులోనూ కొనసాగాలని జాయింట్ డైరెక్టర్ కె. కిరణ్ కుమార్ ఆకాంక్షిస్తూ ఉద్యోగులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఛీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ఓ. మధుసూధన్ మాట్లాడుతూ.. సంక్రాంతి నుండి సూర్యుడు ఉత్తరం వైపు మళ్లడం (ఉత్తరాయణం) ఒక శుభ సూచకమని అన్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల కలయికతో ఈ పండుగను ఎంతో ఆనందంగా జరుపుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఐ. సూర్యచంద్రరావు, ఆర్ఐఈ డాక్టర్. టి. నాగరాజ, డిప్యూటీ డైరెక్టర్లు బి. పూర్ణచంద్రరావు, పి. వెంకట్రాజ్ గౌడ్, డి. రమేష్, అసిస్టెంట్ డైరెక్టర్లు పి. రాజశేఖర్, ఏఎస్ వీరభద్రరావు, కే. నారాయణ రెడ్డి, ఎస్వీ మోహన్ రావు, ఏవో పి. సుదర్శనరావు, జేఈవో నాగరాజు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దుర్గ గుడిలో జరుగుతున్న వరుస అపచారాలకు ప్రాయశ్చిత్తంగా కామధేనువు అమ్మవారి వద్ద వైసిపి నేతల ప్రత్యేక పూజలు

-అమ్మవారికి పట్టుచీర, గాజులు సమర్పించిన వైకాపా నేతలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు





**విజయవాడ, కలంకౌంటర్ :** మాజీ దేవాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ కామెంట్స్ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏదో ఒక అపచారం, ఏదో వివాదం లో అమ్మవారు గుడి వుంటుంది. భవాని దీక్షల ఇరుముళ్ళు చైర్మన్, ఈవో ఈప్పదీశారు. గురు భవానిలు చేయాల్సిన పని ఛైర్మెన్ , ఈవో ఎలా చేస్తారు.. పాలకమండలి అపచారానికి పాల్పడింది.. మూడు గంటల పాటు అమ్మవారి దేవాలయాన్ని చీకట్లో ఉంచారు.. దేవాదాయ శాఖ కి, విద్యుత్ శాఖ కి చంద్రబాబు ముఖ్యమంత్రి కాదా.. అభిషేకానికి వాడే పాలల్లో పురుగులు రావడం, అమ్మవారికి గుడిపై కేకు కట్ చేయడం హేయం లడ్డు ప్రసాదం కౌంటర్ వద్ద కర్రెంట్ షాక్ తగలడం ఇలా దుర్గ గుడిలో అపచారాలు జరుగుతూనే ఉన్నాయి లడ్డులో లేని కల్తీకి మెట్లు కడిగిన పవన్ కళ్యాణ్. ఇప్పుడు అంగ ప్రదక్షిణ చేస్తారా? జగన్ 70కోట్లు రూపాయలు దుర్గ గుడి అభివృద్ధి కి ఇచ్చారు.. చంద్రబాబు సీనియర్ అంటాడు కానీ ఒక్క రూపాయి ప్రభుత్వం నుండి ఇవ్వలేదు.. 18 నెలల్లో అమ్మవారి గుడి అభివృద్ధి కుంటుపడింది.. కృష్ణ నది ఉన్న జల్లు స్థానమే భక్తులకు దిక్కా భక్తులకు కృష్ణ నదిలో స్థానం చేసే భాగ్యం కల్పించరా.. బి. ఆర్ నాయుడు వచ్చిన తర్వాత తిరుపతిలో అన్ని అపచారాలే.. ముక్కోటి ఏకాదశి కి 6గురు చనిపోయారు. చెప్పులతో గుడిలో తిరగడం. మాసం , మద్యం సేవించడం కనిపిస్తునాయి.. ముక్కటీ ఏకాదశికి భక్తులు ఈసారి తగ్గిపోవడానికి కూటమి కారణం.. ద్రాక్షారామం లో శివలింగాన్ని ఎలా కొట్టిస్తారు.. కాశీబుగ్గ లో 9 మంది చనిపోయారు.. సింహాచలంలో నాసిరకం గోడలు కట్టడం వల్ల భక్తులు చనిపోయారు.. ఇప్పుడు కాశీబుగ్గలో 20 లక్షలు దొంగతనం జరిగింది.. శ్రీకూర్మం లో నక్షత్ర తాబేళ్లు చనిపోతుంటే గుట్టు చప్పుడు కాకుండా తీసేస్తున్నారు.. దేవస్థానం ఆస్తులపై ప్రభుత్వం కన్ను వేసింది. సనాతన ధర్మం ముసుగులో ఆస్తులు దోచుకోవడం, భద్రత కల్పించక పోవడం కనిపిస్తుంది.. హిందూ సంఘాలతో కలిసి భవిష్యత్తులో కార్యాచరణ ప్రకటిస్తాం.. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కామెంట్స్ ఎన్ని ఘటనలు జరిగిన మాట్లాడకుడదు అని మౌనం వహించాం.. మా ప్రభుత్వం లో ఏం జరగకపోయినా విమర్శలు చేశారు.. అందరి కోర్కెలు తీర్చి అమ్మవారి గుడిలో 3గంటలు విద్యుత్ నిలిచిపోయింది.. ఎందుకు దీనిపై వెంటనే చర్యలు తీసుకోలేదు.. గోశాల ను అమ్మవారి గుడి దగ్గర నుండి వేరే చోట కి తరలించారు.. ప్యాకెట్ పాలతో అభికేషం చేస్తారా? సక్రమంగా అన్నదానం కూడా జరగడం లేదు. ఎండోమెంట్ కమిషనర్ ఏం చేస్తున్నారు.. కూటమి చెప్పు చేతల్లో ఉండే వాళ్ళను కమిషనర్ గా పెడతారా.. తిరువూరులో వేంకటేశ్వర సామి గుడిలో వెయ్యి ఎకరాలు తీసి అమ్ముకొనే హక్కు ఇచ్చారు..జీవో నెంబర్ 15 ప్రకారం..నగరాలు, పట్టణాల్లో ఉండే విలువైన భూములు దోచుకోవడం కోసం తీసుకొచ్చారు.. జీవో 15 ను రద్దు చేయాలని వైఎస్సార్ సీపీ కోరుతుంది.. గౌడుగుపేట వెంకటేశ్వర స్వామి భూమి లో ఎగ్జిబిషన్ పెట్టీ 33 ఏళ్లకు లీజుంకి తీసుకొని కొట్టేసే ప్రయత్నం చేస్తున్నారు.. దేవుడు భూములు, దేవుడి కి ఇచ్చే గౌరవం ఇదేనా అని అడుగుతున్నాం.. అమ్మవారిని కాపాడమని అందరూ అడుగుతారు.. అమ్మవారికి కాపాడుకోవాలి ఇప్పుడు.. దేవాలయాల్లో అర్చకులకు రక్షణ లేదు.. అయినవిల్లి లో ఒక పూజారి మీద కొడవలితో దాడి చేస్తే కాకినాడ హాస్పిటల్ లో చికిత్సపొందుతున్నారు.. అర్చకస్వాములు, పురోహితులకు రక్షణ గా చట్టం తీసుకొని రావాలి.. మీరు తీసుకొని రాకపోతే మేము తీసుకొని వస్తాం.. కాశీ బుగ్గలో 20లక్షల దొంగలు కొట్టేశారు.. గతంలో దుర్గ గుడిలో క్షుద్ర పూజలు చేశారు.. చైనా వాల్ ను కడితే రోజు వొచ్చి చూసిన ఉమా..నేడు ఎక్కడ ఉన్నాడు.. మా మీద బురద జల్లే కార్యక్రమం చేస్తారు తప్ప..హిందూ ధర్మాన్ని మాత్రం పాటించారు.. చిన్న చిన్న అర్చకులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం అంటే చూస్తూ ఊరుకోం.

# శివ స్వామి ఆశీస్సులు






**మచిలీపట్నం,కలంకౌంటర్ :** శైవక్షేత్రం వ్యవస్థాపకులు.. హిందూ ధర్మ పరిరక్షకులు శివస్వామిని మచిలీపట్నం పర్యటన లో కలం కౌంటర్ దినపత్రిక రవికుమార్ కలిసిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం మరియు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు అందజేశారు.అనంతరం రవికుమార్ ఆధ్వర్యంలో శివస్వామిని సన్మానించారు.

# వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు










**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం వాసవి క్లబ్, వనిత క్లబ్ ఆద్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.స్థానిక గొడుగుపేట శంకర మఠంలో నిర్వహించగా న్యాయ నిర్ణేతలుగా సామా సూర్య, గుడివాడ సుజాత వ్యవహరించారు.ఈ కార్యక్రమం లో ఐ పి సి శ్రీకాకుళపు రేణుకా రాణి, అన్నం అశోక్ ,వేముల శిరీష, తమ్మన అనురాధ, జల్లూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# వివేకానంద జయంతి సందర్భంగా కందుకూరు లో రక్త దాన శిబిరం

**కందుకూరు,కలంకౌంటర్ :** వివేకానందుని జయంతి సందర్భంగా కందుకూరు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకులు రక్తదానం చేశారు. ఏరియా ఆసుపత్రి సూపరెంటెంట్ డాక్టర్ ఇంద్రాణి చేతుల మీదుగా సర్టిఫికెట్లు మంజూరు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇంద్రాణి మాట్లాడుతూ వివేకానందుని జయంతి సందర్భంగా యువత రక్తదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె అన్నారు. ప్రతి ఒక్కళ్ళు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయటం ఆరోగ్యానికి చాలా మంచిదని ఆమె అన్నారు. ఒకరి రక్తదానం మరో ఇద్దరు ప్రాణాలను కాపాడుతుందని ఆమె తెలిపారు. రక్తదాన శిబిరం నిర్వహణకు కారకులైన రెడ్ క్రాస్ చైర్మన్ చెన్నా రామాంజనేయులను ఆమె అభినందించారు.



# బందరు లడ్డుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం నగరంలో ప్రసిద్ధిగాంచిన మల్లయ్య స్వీట్స్ సంస్థ తయారు చేసిన సాంప్రదాయ బందరు లడ్డుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు లభించింది. ఎటువంటి యంత్రాలు ఉపయోగించకుండా, పూర్తిగా చేతితో తయారు చేసిన బందరు లడ్డుతో పాటు ఇతర పిండి వంటల విశిష్టతను గుర్తిస్తూ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. చింతపట్ల వెంకటాచారి మాట్లాడుతూ, మల్లయ్య స్వీట్స్ సంస్థ 1959 సంవత్సరం నుంచి నేటి వరకు జాతీయ స్థాయిలో మంచి పేరు సంపాదించిందని ప్రశంసించారు. ఈ సంస్థ అధినేత గౌర వెంకటేశ్వర్లు గారు సాంప్రదాయ పద్ధతుల్లో నాణ్యత, పరిశుభ్రతతో స్వీట్స్ తయారు చేస్తూ తరతరాలుగా వినియోగదారుల ఆదరణ పొందుతున్నారని తెలిపారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని, గౌర వెంకటేశ్వర్లు గారు 2025 కిలోల పిండి వంటలను---బందరు లడ్డుతో పాటు మరో ఐదు రకాల సంప్రదాయ పిండి వంటలను---తయారు చేయడం ఒక వినూతన ప్రయోగంగా భావించి, దీన్ని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేసినట్లు డా. వెంకటాచారి వెల్లడించారు. స్వీట్స్ తయారీలో పాటించిన పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలను పరిశీలించిన అనంతరం ఈ అవార్డును ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. గౌర వెంకటేశ్వర్లు గారు గతంలో ప్రపంచ తెలుగు మహాసభలు, సంక్రాంతి సంబరాలు, అమరావతి ఆవకాయ కార్యక్రమం వంటి అనేక ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో తన ప్రత్యేకతను చాటుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌర వెంకటేశ్వర్లు గారు మాట్లాడుతూ, విదేశాల్లో ఉన్న తెలుగు ప్రజలకు కూడా తమ స్వీట్స్‌ను పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, స్వీట్స్ రంగానికి చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాలికల విద్య దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది

## –ఒడిశా రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు

### ఉంగుటూరులో నివేదిత గురుకులం నూతన భవనం ప్రారంభోత్సవం చేసిన రాష్ట్ర గవర్నర్










**ఉంగుటూరు,కలంకౌంటర్ :** బాలికల విద్య సామాజిక మార్పుకు నాంది అని పేర్కొంటూ అది దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ఒడిశా రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. ఆదివారం ఒడిశా రాష్ట్ర గవర్నర్ ఉంగుటూరు మండలంలోని ఉంగుటూరులో నివేదిత గురు కులం నూతన భవనం ప్రారంభోత్సవం, అదేవిధంగా ద్వితీయ వార్షికో త్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ గురుకులం అనేది కేవలం విద్యను అందించే సంస్థ మాత్రమే కాదని, అది ఒక సంపూర్ణ జీవన విధానాన్ని బోధిస్తుందని, క్రమశిక్షణ, వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంద న్నారు. బాలికల విద్యకు అంకితమైన గురుకులం సామాజిక మార్పుకు శక్తివంతమైన కేంద్రంగా నిలుస్తుందన్నారు. బాలికల విద్యా అనేది ఒక అవకాశం కాదని, అది దేశ భవిష్యత్తును నిర్మించే మౌలిక అవసరమని బలంగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. నివేదిత గురుకులం పూర్తిగా బాలికల విద్యకే అంకితమై ఉండటం ఎంతో ప్రశంసనీయమ న్నారు. బాలికల విద్య దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఒక బాలిక విద్యను పొందితే ఒక కుటుంబం అభివృద్ధి చెందుతుందని, ఆ కుటుంబాలు అభివృద్ధి చెందితే సమాజం బలపడుతుందని, సమాజం బలపడితే దేశం ప్రగతి సాధిస్తుందని పేర్కొన్నారు. సిస్టర్ నివేదిత ఒక అసాధారణమైన మహనీయురాలు అని, ధైర్యం, అంకిత భావం, స్వార్థరహిత సేవ ఆమె జీవన తత్వానికి ప్రతిరూపాలని పేర్కొన్నారు. ఆమె పాశ్చాత్య దేశంలో జన్మించినప్పటికీ, భారతదేశాన్ని ఆమె తన ఆధ్యాత్మిక, సామాజిక కర్మభూమిగా స్వీకరించిందని, మహిళలు, బాలికల విద్య సాధికారతకు తన సంపూర్ణ జీవితాన్ని అంకితం చేశారని ఆమె సేవలను కొనియాడారు. మహిళలు విద్యావంతులై ఆత్మవిశ్వాసంతో తమ సాంస్కృతిక మూలాలతో అనుసంధానమై ఎదిగినప్పుడే నిజమైన జాతీయ పురోగతి సాధ్యమవుతుందని ఆమె దృఢంగా నమ్మారన్నారు. విలువలతో కూడిన విద్య, సాంస్కృతిక చైతన్యం, సమాజ హితం కలిగిన విద్యను గురుకులం కొనసాగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారతీయ సంస్కృతి ఆధారంగా, ఆధునిక అవసరాలకు అనుగుణంగా విలువలతో కూడిన విద్యను అందిస్తున్న గురుకులం నిర్వహణ కమిటీ దూర దృష్టిని అభినందిస్తున్నానన్నారు. భారతీయ సంగీతం, యోగ, ధ్యానం, వేద పఠనం వంటి ప్రక్రియలను ఈ గురుకులం నుండి పొందిన విద్యార్థులు భవిష్యత్తులో భారతీయ సాంస్కృతిక రాయబారులుగా తయారవుతారని విశ్వసిస్తున్నానన్నారు. బాలికల విద్యకు ప్రభుత్వాలు ఎంతో ప్రాధాన్యతనిస్తున్నాయని, రాజకీయంగా, వ్యోమగామిగా, ఆపరేషన్ సింధూర్ తదితర అన్ని రంగాలలోనూ మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని ఇది మంచి శుభపరిణామం అని పేర్కొన్నారు. అయితే, షెడ్యూల్ జాతుల బాలికల విద్యను ఇతరులతో పోల్చి చూసినప్పుడు అక్షరాస్యతలో వెనుకబడి ఉన్నామని విచారం వ్యక్తం చేస్తూ, ముఖ్యంగా ఇది ఒడిశా రాష్ట్రంలో గిరిజన ప్రజల్లో అత్యధికంగా ఉందని, అటువంటి వారిని అన్ని ప్రాంతాలలో ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందన్నారు. ప్రాథమిక విద్యకు బలమైన పునాది ఉండాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం 2020ను తీసుకొచ్చిన సందర్భాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగాలు ఇచ్చే వారిగా విద్యార్థులను తయారు చేయడమే గురుకుల ముఖ్య బాధ్యతగా పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తొలుత విద్యార్థులు హోమం ప్రక్రియ నిర్వహించడంతో పాటు కోలాటం, యోగాసనాలు, యోగ చాప్, తాడు(రోప్)యోగ, సైకిల్ విన్యాసం, జడ కోలాటం, తదితర వ్యాయామ ప్రక్రియలు ప్రదర్శించారు. అదేవిధంగా కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈవో ధాత్రిరెడ్డి, శ్రీ విజ్ఞాన విహార వైస్ ప్రెసిడెంట్ వల్లభనేని సుధాకర్ చౌదరి, శ్రీ పద్మావతి వెంకటేశ్వర ఫౌండేషన్ అధినేత డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, జయరామ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యుడు దాసరి వెంకట బాలవర్ధన రావు, కేఎల్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ కోనేరు సత్యనారాయణ, విహెచ్పి జాతీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు, ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యకారిణి సభ్యుడు భాగయ్య, ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు పాలనలో ప్రతి ఇంటిలో సంతోషం-ఎంపీ వేమిరెడ్డి

- 2029లో కూడా కూటమిదే విజయం
- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమం, అభివృద్ధి ఆగలేదు
- ప్రతిక్షణం ప్రజల కోసం సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారు
- కందుకూరులో దాదాపు 250 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు
- కందుకూరును ప్రకాశం జిల్లాలో కలపడంలో ఎమ్మెల్యే పాత్ర కీలకం
- నియోజకవర్గ అభివృద్ధికి నాగేశ్వరరావు ఎంతో శ్రమిస్తున్నారు
- విపిఆర్ నేత్ర ద్వారా ప్రతి గ్రామంలో కంటి వెలుగులు
- సేవ కోసమే విపిఆర్ ఫౌండేషన్ ఏర్పడింది
- ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు






**కందుకూరు,కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో ప్రతి ఇంటిలో సంతోషం కనిపిస్తోందని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. 2029లో కూడా కూటమి ప్రభుత్వమే వస్తుందని స్పష్టం చేశారు. ఉలవపాడు మండలం మన్నేటికోట, లింగసముద్రం మండలం అంగిరేకులపాడు, మేదరమెట్లపాలెం పంచాయతీలోని జంగాలపల్లిలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 3 విపిఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్లను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. అంగిరేకులపాడు, లో సిమెంట్ రోడ్లు, గోకులం షెడ్లను వారు ప్రారంభించారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానంద చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి కళ్లలో నేడు సంతోషం కనిపిస్తోందంటే అది సీఎం చంద్రబాబు పాలన వల్లే సాధ్యమన్నారు. ప్రతి గ్రామంలో అభివృధి కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. 1వ తేదీనే పింఛన్లు అందిస్తున్నారని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి లో ముందుకు తీసుకుపోతున్నారని చెప్పారు. ప్రజలకు అవసరం అయిన పనులు మాత్రమే చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రజలకు అందుబాటులో ఉంటూ పని చేస్తున్నారన్నారు. కందుకూరు మళ్ళీ ప్రకాశం జిల్లాలో కలవడంలో ఆయన కృషి చాలా ఉందన్నారు. నియోజకవర్గంలో వివిధ బ్రిడ్జి ల ఏర్పాటుకు కృషి చేస్తున్నారని చెప్పారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2017లో ఏర్పాటు చేసిన ప్లాంట్స్ కూడా ఇప్పటికీ పని చేస్తున్నాయని వివరించారు. విపిఆర్ నేత్ర ద్వారా మూడు మండలాల్లో 15 వేల మందికి ఉచితంగా కంటి పరీక్షలు, 8వేల మందికి అద్దాలు అందజేసినట్లు చెప్పారు. నియోజకవర్గంలో 145 మంది దివ్యాంగులకు ట్రై సైకిల్స్ అందించినట్లు తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధితో కందుకూరు నియోజకవర్గంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ఎలాంటి ఢోకా ఉండదన్నారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఎంపీలు గ్రామాలకు ఒక్కరోజు కూడా వచ్చేవారు కాదని, కానీ నేడు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నిత్యం ప్రజల మధ్యే తిరుగుతుంటారని చెప్పారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు 3 విపిఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయం అని కొనియాడారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించామని, వందల కోట్ల అభివృద్ధి పనులు కేటాయిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు కి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, మంత్రి నారా లోకేష్ కి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా దాదాపు 10 కోట్ల రూపాయలు ప్రజలకు అందించామన్నారు. బిపిసిఎల్ కంపెనీ, ఇండోసోల్ సోలార్, రామాయపట్నం పోర్టు ఏర్పాటుతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచి పులివర్తి బసవయ్య నాయుడు, మాధవి, శ్రీనివాస్ బాబు, మండల పార్టీ టిడిపి అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, మండలంలోని అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల సభ్యులు కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు..

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com